అడల్ట్స్ ఓన్లీ కథ



# ప్రైవసీ

''షిట్'' అసహనంగా అన్నాడు మనోజ్, స్టీరింగ్ వీల్ మీద కొడుతూ.

''ఏమైంది?'' అతని భుజం మీద తలవాలుస్తూ అడిగింది వినీల.

''కారు ఇక ముందుకు కదలదు- ఈ టైమ్‌లో మెకానిక్ దొరకడు. తెల్లారాకగానీ... ఇప్పుడు రిపేరంటే కష్టం. ఎలాగా?'' అంటూ వినీల వంక చూశాడు.

మెళ్లోని పసుపుతాడు, ఆమె వేసుకున్న నగల మధ్య వింత అందంతో ఆమె కొత్తపెళ్లికూతురంటూ చెబుతోంది. నగల మెరుపులతో పోటీ పడుతున్న ఆమె వంటి మీదున్న చీరకున్న చెమ్కీ వెన్నెల కాంతిలో తళతళ మెరుస్తోంది. ఆ నిర్జన ప్రదేశం.. చీకటి... చాలా దూరంగా కనిపిస్తోన్న ఇళ్లు...

''మరెలా? ఈ రాత్రి గడవటం'' భయంగా అడిగింది వినీల.

''ఈ రాత్రికిక కారులోనే రొమాన్స్ రాసిపెట్టినట్టున్నాడా దేవుడు'' తేలిగ్గా అన్నాడు మనోజ్.


చురచుర చూసింది వినీల.

''నీకెప్పుడూ ఆ ఆలోచనే తప్ప వేరే ఏం లేదా? నగలకోసం, డబ్బు కోసం ఎవడన్నా అటాక్ చేస్తే ఎలా?'' భయంగా అడిగింది. పది రోజుల హనీమూన్ ట్రిప్ ఆనందంగా ముగించుకుని, సొంత ఊరికి వస్తుండగా ఇలా జరగడం, ఆమెకి అశుభంగా తోస్తున్నది.

ఈసారి ఆలోచనలో పడ్డాడు మనోజ్. కారు దిగి చుట్టూ చూశాడు.

''విన్నీ... కారు దిగు'' అంటూ పిలిచాడు.

ఆమె కారు దిగగానే లాక్ చేసి ''పద... వెన్నెల్లో హాయ్ హాయ్ అని పాడుకుంటూ నైట్‌వాక్ చేద్దాం'' అన్నాడామె నడుము చుట్టూ చేతులేస్తూ.



విదిలించుకుని దూరంగా జరిగిందామె. ''మన్నూ... వాటీజ్ దిస్.. ఓ పక్క నేను భయపడ్తాంటే నీకు నవ్వులాటగా వుందా?'' అంది కోపంగా.

''అరె యార్! భయం దేనికి? అదుగో దూరంగా ఇళ్లు కనిపిస్తున్నాయి. ఈ రాత్రికక్కడ షెల్టర్ దొరికితే పొద్దుటే మెకానిక్‌ను తీసుకొస్తే ప్రాబ్లెం సాల్వ్ అవుతుందిగానీ ధైర్యంగా ఉండు'' అన్నాడు మనోజ్.

''ఈ చీకట్లో మనిద్దరమే ఇలా నడవాలంటే భయంగా వుంది. ఏ దొంగో వస్తే ఎలా?'' కొంగు మెడచుట్టూ లాక్కుంటూ అడిగింది.

వాలి హిరణ్మయీ దేవి

శృంగార కథల పోటీలో వెయ్యి రూపాయల బహుమతి అందుకున్న రచన

''అమ్మడూ, ఈ రూట్లో అంతగా దొంగల భయం లేదు గానీ పాములేవన్నా తిరుగుతూంటేనే కాస్త ప్రమాదం'' అన్నాడు.

''అమ్మో పాములా?'' వణికిపోతూ అతన్ని హత్తుకుపోయింది వినీల.

''ఆహా! నువ్విలా హత్తుకుపోతూ వుంటే నాలో లోలో ఎక్కడో ఏదో వింత సంచలనం'' అన్నాడామెని మరింత హత్తుకుంటూ.

ఆమె అనుమానంగా అతని వంక చూసింది.

''పిచ్చీ... పాముల్లేవ్ గీముల్లేవ్. నువ్ దూరంగా నడుస్తూంటే కావాలని అలా అన్నాను. అహ... కోపంగా చూడకు. అలా అంటేగానీ ఇలా హత్తుకోవుగా మరి''

''నిన్నూ... '' అంటూ గుప్పెళ్లతో అతని గుండె మీద కొట్టింది వినీల.

''సుకుమారీ! నన్ను కొడుతూ నీ ఎనర్జీ వేస్ట్ చేసుకోకు. ఇంకో పదీ పదిహేను నిమిషాలు నడవాల్సి వుంటుంది. నడుస్తావా లేక ఎత్తుకోనా?'' అడిగాడు కొంటెగా మనోజ్.

''ఎత్తుకో'' పంతంగా అంది వినీల.

వెంటనే ఆమెను ఎత్తి తన భుజాల మీదకు చేర్చుకోబోయాడు మనోజ్.

''అబ్బ... నీతో ఏదన్నా తంటానే'' అంటూ కిందకు జారింది వినీల.

పదిహేను నిమిషాల నడక, అనంతరం ఓ ఇంటి తలుపు తట్టారు.

''ఎవరదీ?'' అంటూ వచ్చాడొక అరవై ఐదూ, డెబ్భయ్‌ల మధ్య వయసున్న వ్యక్తి.

''మేము హైద్రాబాద్‌కి వెళ్లాలి. దార్లో కారు చెడిపోయింది. ఈ రాత్రికిక్కడ ఆశ్రయం దొరుకుతుందేమోనని వచ్చాం. తెల్లవారగానే వెళ్లిపోతాం'' అన్నాడు మనోజ్.

''అలాగా.. రండి బాబూ! రామ్మా!'' అంటూ ఆ వృద్ధుడి వెనుక నుంచి పిలిచిందో స్త్రీ.

## నవ్వుల పువ్వులు

**సహచర నటులు నటించిన చిత్రాల విజయోత్సవ సభలకు హాజరయ్యే నటీనటులు కూడా ఎంతో హేపీగా ఫీలవుతారు. ఈమధ్య 175 రోజుల దేవదాసు చిత్రం వేడుకకి హాజరైన వెంకీ కూడా నవ్వుతూ కన్పించారు. 'వైవియస్ కొత్త అందాలభామ ఇలియానాని తెలుగు తెరకి పరిచయం చేశారు. ఆమెలోని టాలెంట్‌ని మరింత మంది దర్శకులు తెరకెక్కిస్తారు' అంటూ కామెంట్ చేసి అందర్నీ నవ్వించారట. ఇంతకీ వెంకీ త్వరలో నటించబోయే చిత్రంలో ఈ పోకిరీ భామ నటించనుందంటారా?**


ఇద్దరూ లోపలికి నడిచారు.

ముందు గదిలో ఓ నాలుగు కాళ్ల పొడుగుబల్ల వుంది. దాని మీదే వారిద్దరూ పడుకున్నారని తెల్పుతూ పక్క పరిచి వుంది.

''పెరట్లోకి వెళ్లాలంటే రామ్మా'' అంటూ వినీలను తీసుకెళ్లింది.

తర్వాత వినీలతో తిరిగి వస్తూ ''కొద్దిగా అన్నం వుంది. మీరిద్దరూ పెద్దింటి బిడ్డల్లా వున్నారు. మా ఇంట్లో తింటారో లేదో'' అందామె ఆప్యాయంగా.

''భోజనాలవీ అయ్యాకే బయలుదేరాం మామ్మగారూ! ఆ ప్రయత్నాలేవీ వద్దుగానీ కాస్త పక్కలే ఏర్పాటు చేస్తే...'' అంటూ ఆమె గమనించకుండా వినీలకు కన్ను కొట్టాడు మనోజ్.



అతని జబ్బ మీద బలంగా గిల్లింది వినీల. ''అబ్బా'' అన్నాడు మనోజ్.

''అరె ఏమైంది?'' అందామె కంగారుగా.

''అబ్బే దోమ... ఆడదోమ కరిచినట్టుంది'' అన్నాడు భుజం రాసుకుంటూ.

''ఇది మా వంటిల్లు. విశాలంగానే వుంటుంది. మంచం లేదు. ముందుగదిలోని బల్ల సరిగ్గా లేదు. ఐనా అది మీకు సరిపోదు. మరి చాప మీదే పడుకోవలసి వుంటుంది'' అందామె కాస్త నొచ్చుకుంటూ.

''మరేం పర్వాలేదు. ఇంతవరకూ చాప మీద ఎప్పుడూ...'' ఇంకా ఏదో అనబోతున్న మనోజ్ కాలుమీద తన కాలితో గట్టిగా నొక్కింది వినీల. దాంతో నోర్మూసుకున్నాడు. ఆ మరుక్షణమే ఏదో డౌటొచ్చి ''మరి బాత్‌రూమ్‌కెళ్లాల్సి వస్తే ఎలా గండీ'' అనడిగాడు మనోజ్.

అతనే ఉద్దేశంతో అడిగాడో అర్థమైన వినీల చప్పున తలదించుకుంది.

''ఈ ముందు గదిలోంచే వెళ్లాలి. మాకేం ఇబ్బంది కాదు. వెళ్లొచ్చు'' అందామె, ముసిముసిగా నవ్వుతూ.

''ఐతే గుడ్‌నైట్'' అన్నాడు మనోజ్.

ఆమె అక్కడ్నుంచి కదలగానే వినీలను లోపలికి లాగి, తలుపులు చప్పుడు కాకుండా మూసాడు.

''చాప మీద ఎలా వుంటుందో ఆ ఎక్స్‌పీరియన్స్ అనుకుంటే... ఈవిడేంటి పరుపు పరిచింది'' అన్నాడు పక్కమీద ఒరుగుతూ.

''నీకస్సలు సిగ్గులేకుండా పోతోంది. ఏంటలా దానికి మొహం వాచినట్టు ఎగబడిపోవటం... మనిషన్నాక కాస్త నిగ్రహం ఉండాలి'' అంది కోపంగా.

''కొత్త పెళ్లాం దగ్గర నిగ్రహం పాటించాలని ఏ సుమతీకారుడూ రాయలేదమ్మా''

''ఈ పది రోజులుగా చూస్తున్నాగా... మీకున్న నిగ్రహం ఎలాంటిదో. అవ్వ... ఒక్క రోజులోనే మూడు నాలుగుసార్లా? పెళ్లికి ముందెన్ని కళలు ప్రదర్శించారో... ముందు అసలు ఏ అనుభవమూ లేనిదే అలా రెచ్చిపోగలుగుతారా? పిచ్చిదాన్ని మీవాళ్ల మాటలు విని మోసపోయాను. కాదు కాదు మోసపోయాం'' అంది వినీల.

''హతవిధీ... భర్త రసికత చూసి భార్య గర్వపడుతుంది గానీ ఇలా కోడిగుడ్డుకు ఈకలు పీకదు. సరే నిగ్రహం లేదంటున్నావ్‌గా ఈ రాత్రికి నీ ఒంటి మీద చెయ్యేస్తే అప్పుడను'' అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

''సరే... ఆ మాట మీదే నిలబడు'' అంది వినీల.

అరగంటయ్యేసరికి నిద్రలోకి జారుకున్న ఆమెను చూస్తే జెలసీ అనిపించింది మనోజ్‌కి. ఎందుకంటే ఆమె వంటి స్పర్శ లేక నిద్రాదేవి కరుణించడం లేదతన్ని. 'అరె.. ఇన్నాళ్లూ తను ప్రక్కనుంటేనే నిద్రపోయానా? ఇవాళెందుకు నిద్రపోలేక పోతున్నాను? హు... ఆమాత్రం కంట్రోల్ లేకుంటే ఎలా?' అనుకుంటూ అటూ ఇటూ దొర్లసాగాడు.

'ఛ... నిజంగా నాకు బుద్ధి లేదు. లేకుంటే చలి కాలంలో ఇలాంటి పంతాలకు పోవడం ఏంటి?' అని తననితాను తిట్టుకుంటూ ఎప్పటికో నిద్రలోకి జారుకున్నాడు.

మధ్య రాత్రి టాయ్‌లెట్‌కి వెళ్లాలని లేచింది వినీల. ముందు గదిలోకి వెళ్లి బల్లమీద వారిద్దరూ ఒకర్నొకరు హత్తుకుని పడుకుని వుండడం చూసి బిడియపడి గబుక్కున తన గదిలోకి వచ్చేసింది.

అలికిడికి మెలకువ వచ్చిన మనోజ్ ''ఏంటి?'' అన్నాడు.

''మరి.. టాయ్‌లెట్‌కెళ్లాలి'' అంది వినీల.

భయపడుతోందేమోననుకుని- ''నేను తోడొస్తా పద'' అంటూ వినీల వారించే లోపునే ముందు గదిలోకి వెళ్లాడు మనోజ్.

బల్లమీద గువ్వల జంటలా పడుకున్న ఆ వృద్ధ జంట తీరు అతనికెంతో ముచ్చటకొల్పింది. అతని మోచేతి వంపులో ఆమె తల. ఆమెకు రక్షణ కవచంలా అతని మరోచేయి ఆమె నడుముని చుట్టే ఉంది. ఆమె మొహంలో తృప్తి. అతనిస్తున్న భద్రతతో నిశ్చింతగా పడుకున్న తీరు మనోజ్‌కెంతో నచ్చింది. తనింట్లో గానీ బంధువుల ఇళ్లలో గానీ అతనెప్పుడూ ఏ భార్యాభర్తలు ఇంత సన్నిహితంగా పడుకున్నది చూడలేదెప్పుడు మరి. వెనక్కి తిరిగి వినీలను పెరట్లోకి తీసుకెళ్లి ఆమె పని ముగించుకున్నాక తిరిగి లోపలికి తీసుకువచ్చాడు.

పక్క మీద ఒరుగుతూనే వినీల బ్లాంకెట్ కప్పుకుని అటు తిరిగింది. ఆమె పక్కగా పడుకుంటూ ''హు... ముసలివాళ్లకున్నపాటి స్పిరిట్ కూడా లేని పెళ్లాన్ని పొందిన నేను నిజంగా ఎంత మందభాగ్యుడిని. అదే అభాగ్యవంతుడిని'' అన్నాడు వినీల చెవిలో.

''ఆహా! తమరి భాషాప్రావీణ్యానికి జీవితం మీద విరక్తి కలుగుతోంది'' అంది వెక్కిరింతగా.

''మొగుడి దగ్గర అందులోనూ కొత్త మొగుడి దగ్గర ఎలా ఉండాలో తెలీదుగానీ వెక్కిరింపులకే లోటూ లేదు'' అన్నాడు కోపంగా.

ఆ కోపానికి శబ్దం రాకుండా తనలో తనే నవ్వుకుంది వినీల. ఆ తర్వాత కాసేపటికి తలెత్తి చూసేసరికి నిద్రలోకి జారుకున్న మనోజ్ కనిపించాడు. అతడినలా చూస్తోంటే ఆమెకు తమ తొలి సమాగపుసంగతులు గుర్తుకొచ్చాయి.

''ఈ రాత్రికి శోభనానికి ముహూర్తం పెడుతున్నార్రా... ఎటూ వెళ్లబోకు'' అంది మనోజ్ తల్లి అరుంధతమ్మ.

''మమ్మల్ని ఓ గదిలోకి నెట్టి, అప్పటికప్పుడు మూడ్ తెచ్చుకోమని చెబుతూ, అమ్మలక్కలు నల్గురూ నాల్గు కిటికీలకు అతుక్కుని మమ్మల్ని చూస్తూ కిచకిచలాడుతూ... ఓ హెల్... అలాంటిదేమీ వద్దు. మా ఫ్రెండ్స్ మా హనీమూన్‌కి అరకువేలీ వెళ్లిరమ్మని అన్ని ఏర్పాట్లు చేశారు. అక్కడికెళ్లాక మా తిప్పలేవో మేం పడతాంగానీ ఇలాంటి ఛాదస్తాలని రుద్దకండి'' అంటూ కచ్చితంగా చెప్పేసాడు మనోజ్.

''ఇదేంటండీ... ఈ వింత'' అంటూ తన తల్లి విస్తుబోతే ''పెళ్లయ్యేవరకే మనిష్టాలు చెల్లుతాయ్. ఆ తర్వాతివన్నీ వాళ్లిష్టప్రకారమే జరగాలి'' అని తండ్రి వాళ్లకే వత్తాసు పలకడంతో దడదడలాడే గుండెలతో అతనితోపాటు బయలుదేరింది వినీల.

జర్నీలో అతని ఒళ్లు తగిలినప్పుడల్లా వినీల ఒళ్లు జల్లుమనేది.

''మనం వైజాగ్ వరకూ ఈ ట్రైన్‌లోనే వెడుతున్నాం. ఈ కూపేలో నువ్వూ-నేనూ అంతే. బోలెడంత ప్రైవసీ. ఇలా బావుందా? ఎందుకలా భయపడుతున్నావ్? నేను నీ మొగుణ్ని తల్లీ. నువ్ నాతో ఫ్రీగా ఉండొచ్చు. నన్ను నీ ఫ్రెండ్ అనుకో. 'ఏవండీ గీవండీ' పిలుపులు కూడా వద్దు. ఓకేనా'' అంటూ ఆమెను మాటల్లో పెట్టి చాలా వరకు భయాన్ని తగ్గించాడు.

''ఇలా ఉయ్యాల జంపాలలూగుతూ మనిద్దరం ఇలా ఇంత దగ్గర దగ్గరగా ఉంటే ఎంతో థ్రిల్‌గా ఉంది కదూ'' అన్నాడామె చెవితమ్మె కొరుకుతూ. సిగ్గులమొగ్గే అయిపోయింది. భుజం మీదో చేయి- నడుము చుట్టూ మరో చెయ్యి అతను వేయగానే ముందు ముందు ఇంకేం చేస్తాడోనన్న ఎగ్జయిట్‌మెంట్‌తో ఆమె జాకెట్ బిగుతైపోయింది.

''వణుకుతున్న నీ ఎర్రటి పెదవుల ముందు చెర్రీపళ్లు బలాదూరే సుమా'' అంటూ పెదవుల నందుకుని పీల్చేస్తూంటే తాళలేక చిన్నగా నోరు తెరిచింది.

అంతే.. అతని నాలుక కొస ఆమె నాలుకతో సరాగాలాడడం మొదలుపెట్టింది. ఆ తర్వాత శంఖం వంటి మెడ మీదకు పెదవులతో దండయాత్ర చేశాడు. అందులో విజయం పొందిన ఉత్సాహంతో సమున్నతమైన హృదయ సంపదను కొల్లగొట్టేందుకా ఎత్తుపల్లాలను స్పృశిస్తూ వుంటే తాపం చెలరేగి, తట్టుకోలేక, చిన్నగా మూలిగి అతని తలని తన గుండెలకు హత్తుకుంది వినీల. కోరికల తాలూకు వేడి ఉధృతం కావడంతో ఇరువురి శరీరాలు జ్వరం వచ్చినట్టు సెగలతో నిండిపోయాయి. వస్త్రాలెలా పక్కకు తప్పుకున్నాయో వారికే తెలియకుండా



## అందం అజరామరం

**అందానికి కొత్త నిర్వచనంలా ఉండే ఐశ్వర్యారాయ్ అప్పుడెప్పుడో అందాల కిరీటాన్ని సొంతం చేసుకున్నా తన అందంలో ఎలాంటి మార్పులేదని నిరూపించుకుంది. ఈమధ్య ఓ విదేశీ మ్యాగజైన్ నిర్వహించిన ప్రపంచ అందాల పోటీలో ఐశ్వర్యారాయ్‌కి అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పదిమంది అందమైన అతివల్లో ఐస్‌కు స్థానం దక్కింది. హాలీవుడ్ భామ అంజెలీనా జోలీ ప్రథమస్థానంలో నిలవగా మన ఇండియా నుంచి ఐస్‌కు ఈ గౌరవం దక్కింది.**

అయింది. శిల్పాల్లో కనిపించే కుచద్వయపు సోయగం కళ్లముందు విందులు చేస్తూంటే ఆమెను అల్లుకుపోయాడతను. గిలిగింతల పులకింతలు మొలకలెత్తి, వారి వలపుల వ్యవసాయం ఫలవంతమైంది.

ఆ తలపుల నుంచి వినీల తేరుకునేసరికి తెల్లారిపోయింది. మెల్లగా లేచి చీరా, జుట్టూ సవరించుకుని ముంధుగదిలోకి నడిచింది.

''లేచావామ్మా! మొహం కడుక్కుని రా. కాఫీ ఇస్తాను'' అందామె ప్రేమగా.

ఆమెను చూస్తే తన అమ్మమ్మే గుర్తుకొచ్చింది వినీలకు.

ఓ అరగంట తర్వాత మనోజ్ లేచాడు.

''కాఫీ పట్టికెళ్లి ఇవ్వమ్మా'' అన్న ఆమె మాటలతో కాఫీ పట్టుకెళ్లి, ఇచ్చింది వినీల. ఆమె వంక కొరకొరా చూస్తూ కాఫీ తాగాడు మనోజ్.

అప్పటికే లేచి వీధి అరుగు మీద కూర్చున్న వృద్ధుని పక్కగా కూర్చుని నాల్గు దిక్కులా చూశాడు. మావిడిచెట్లు, బావి పక్కగా ఉన్న అరటి చెట్లు, రకరకాల పూలమొక్కలతో హరిత భరితంగా వుంది. ఇంటి మీదుగా పాకించిన కాకర పాదు- ఆనపపాదు, తమ పిందెలను చూసుకుంటూ నవ్వుతూ ఉన్నాయి.

''పూలు కోసుకోమ్మా'' అన్న శ్యామలమ్మ మాటలతో అక్కడికొచ్చి కనకాంబరాలని సంభ్రమంగా చూస్తూ తెంపసాగింది వినీల.

''తాతగారూ, ఇక్కడెంతో ప్రశాంతంగా ఎంతో బావుంది. కదలాలన్పించటం లేదుగానీ వెళ్లక తప్పదుగా. ఇప్పుడిక్కడెవరైనా మెకానిక్ దొరుకుతాడా'' అనడిగాడు మనోజ్.

''ఇక్కడెవరూ ఉండరు. అందుకే మా పక్కింటతను చౌరస్తాకి వెళుతుంటే మెకానిక్‌ని ఇక్కడికి పంపించమని చెప్పాను. ఓ గంటా, గంటన్నరకల్లా వస్తాడు. అంతవరకూ ఎలాగోలా ఉండాల్సిందే'' అన్నాడు అతను.

మాటల్లో మనోజ్ వివరాలడిగి తెలుసుకున్నాడు. పదేళ్లకి పైగా తనూ తన భార్య శ్యామల ఇక్కడ ఉంటున్నట్టు, నల్గురు మగపిల్లలు.. అందరూ సెటిల్ అయ్యారని చెప్పి, మనోజ్ వివరాలూ కనుక్కున్నాడు రమణమూర్తి.

''అవును తాతగారూ! మీరిప్పుడే చెప్పారుగా.. మీ పిల్లలంతా వెల్ సెటిల్డ్ అని. మరి మీరిద్దరు ఇలా ఒంటరిగా...'' అంటూ ఆగిపోయాడు మనోజ్.

ఆ ప్రశ్నకు రమణమూర్తేం చెబుతాడోనని స్త్రీ సహజమైన కుతూహలంతో వినీల కూడా మనోజ్ పక్కన కూర్చుని వినసాగింది.

''ఒంటరిగా ఏముంది? మేమిద్దరం ఒకరికొకరం తోడుగా ఉన్నాముగా. నాకొచ్చే కొద్దిపాటి ఆదాయంతో మేమిద్దరం హాయిగా తృప్తిగా ఉంటున్నాం. ఎవరి అదుపాజ్ఞలకు, శషభిషలకు లొంగే ప్రసక్తి లేకుండా'' అన్నాడాయన.

''మీరే పెద్దవారు. మీకు ఒకరి అదుపాజ్ఞలేంటి?'' విస్మయంగా అడిగింది వినీల.

''నాకు నలుగురు కొడుకులు. వాళ్లు జీవితంలో సెటిలయ్యేలా రెక్కలు ముక్కలు చేసుకుని మరీ కష్టపడ్డాను. ఇంటి పట్టున భార్యతో ఉండాలన్న కోరికను చంపుకుని మరీ పార్ట్‌టైమ్ జాబ్‌లు కూడా చేస్తూ అర్ధరాత్రి ఇల్లు చేరేవాడిని. మగపిల్లలతో పనేం చేయిస్తానంటూ నా భార్య తన ఎముకలరిగేలా పనులన్నీ చేసుకునేది. అలాంటి మాకు, మా ఇద్దరి వయసుడిగేసరికి వాళ్లనుంచి- వాళ్లనుబట్టే మా కోడళ్ల నుంచి నిరాదరణ ఎదురైంది. మా ఇద్దరి పోషణ భారం వారికి చాలా ఎక్కువై మమ్మల్ని నెలల వారిగా పంచుకున్నారు. ఆమె ఒక చోట నేనొక చోట. నాకు నా పధ్నాలుగో ఏట పెళ్లయింది. అప్పుడు నా భార్యకి ఎనిమిది ఏళ్లు. అంటే మా సహచర్యపు జీవితం వయసు యాభై ఆరేళ్లు. అంతకాలంగా కలిసి ఉన్న మమ్మల్ని వాళ్లలా విడదీసి చెరో చోటా ఉంచితే తట్టుకోలేకపోయాం. మాకీ వయసులో సెక్స్ అవసరాన్ని మించి, ఒకరి సామీప్యం మరొకరికి ఆసరా అవసరం. మేమిద్దరం చెప్పుకునే కబుర్లు- ఈ తరం వాళ్లకి చెప్పబోయినా నచ్చవు. వాళ్లకవి వినే టైమ్, ఓపికా ఉండవు. మమ్మల్ని విడదీయటంతో కొత్త కొత్త ప్లేస్‌లలో దొరికిన కొత్త వ్యక్తులతో ఏమని మాట్లాడతాం? తెగ బోర్ కొట్టేది. నా భార్యకైతే పనిభారం మరింత పెరిగి అనారోగ్యం పాలయింది. నా మనవడిలాంటి వాడవు. నీ దగ్గర సిగ్గుపడేదేముందిగానీ నాకు మీ మామ్మను దగ్గరగా హత్తుకుని పడుకోందే నిద్రరాదు. చెప్పాగా యాభై ఆరేళ్ల నుంచీ ఉన్న అలవాటు. వాళ్లు మా బెడ్ రూంలను ఆక్రమించి వసారా మాకు కేటాయించారు. మేం ఏమాత్రం సరదాగా మాట్లాడుకున్నా ఈ వయసులోనూ ఏంటా వెకిలితనం అన్నట్టు కొడుకులూ, కోడళ్లూ చూస్తే తల కొట్టేసినట్టుండేది.

ఆఖరుకి నా భార్యకు నేను పూలు తెచ్చినా తప్పే. పూలు తెస్తే ఎంతో ఆనందంగా అందుకునే ఆమె ఇబ్బందిగా ''ఎందుకు తెచ్చారండి? కోడళ్లు వెక్కిరింతగా నవ్వుతున్నారు'' అంటూ ఆ పూలు పెట్టుకునేది కాదు. మా పెళ్లయింది మొదలు తలలో పూలు ముడవకుండా ఉండేది కాదు. 'సుమంగళులు పూలు లేకుండా ఉండకూడదట. మా బామ్మ చెప్పేది' అంటూ ఏ పూలూ తేని రోజున ఇంట్లో పూచే నందివర్ధనం

## తప్పుదిద్దుకుంటే..

**జీవితంలో అంతా ఎప్పుడో ఒకప్పుడు తప్పులు చేస్తుంటారు. అయితే వాటిని సకాలంలో గుర్తించి దిద్దుకుంటే మంచికి బాటలు వేసుకున్నవారం అవుతాం. సినీరంగంలో ఒక్కోసారి మనం తీసుకున్న నిర్ణయాలు కొంచెం ఇబ్బందికి గురిచేస్తుంటాయి. వాటిని సరిదిద్దుకునే ప్రయత్నాలు కూడా ఆలస్యం అవుతాయి అంటోంది అమృతా అరోరా. 'నా నిర్ణయాలు అప్పుడప్పుడూ నాకు ఇబ్బందిని తెస్తుంటాయి. వాటిని సరిదిద్దుకునే మార్గాల గురించి ఆలోచిస్తుంటాను. రాంగ్ ఛాయిస్‌లనుంచి అలా బయటపడుతుంటాను' అంటోంది అమృతా అరోరా.**



పూలైనా పెట్టుకునే ఆమె తన ఇష్టాన్నలా చంపుకుంది. అంతేనా ఎన్నో ఇష్టాలనలా అణచుకోవలసి వచ్చింది. అదృష్టంకొద్దీ దేవుడు మంచి ఆరోగ్యాన్ని, సామర్థ్యాన్ని ఇచ్చాడు హాయిగా ఉండేలా. కానీ అడుగడుగునా వాళ్లు పెట్టే ఆంక్షల వల్ల ఊపిరాడనట్టయింది. పడుచు జంటలకే కాదు, దంపతులన్న వారికీ, వయసు మళ్లిన వారిక్కూడా 'ప్రైవసీ' అవసరం కాదు, కాదు అత్యావసరం అని నా అభిప్రాయం. అందుకే వాళ్లకివ్వాల్సింది వాళ్లకిచ్చేసి మిగిలిన డబ్బుతో వారికి దూరంగా ఇలా ఇక్కడ ఈ చిన్న ఇల్లు కట్టుకుని, మిగిలిన డబ్బు బ్యాంక్‌లో వేసి, ఆ వచ్చే వడ్డీతో ఈ పొదరింట్లో బతుకుతున్నాం. గంజి తాగినా సుఖంగా వుంది. నేను ట్యూషన్ చెబుతోన్న పిల్లల తల్లిదండ్రులు వాళ్ల శక్తి ఉన్నంతవరకూ కూరగాయలు, పళ్లూ తెచ్చిస్తుంటారు. నోరు మంచిదయితే ఊరు మంచిదన్నట్టు మేమిద్దరం ఇక్కడివాళ్లకు పెద్ద దిక్కు. అందరూ మాకు పిల్లలే. ఇక్కడ మేము, మేము కోరుకున్నట్టుగా హాయిగా ప్రశాంతంగా ముఖ్యంగా ఒకరికొకరమన్నట్టు బతుకుతున్నాం'' అన్నాడు.

మనోజ్‌కి అతని ఆలోచనాసరళి, శేషజీవితాన్ని ప్లాన్ చేసుకున్న తీరూ అమితంగా నచ్చింది.

ఇంతలో మెకానిక్ రావడంతో వారి దగ్గర వీడ్కోలు తీసుకుని బయలుదేరారు మనోజ్, వినీల.

★ ★ ★

''ఎలా జరిగింది హనీమూన్ ట్రిప్'' అంటూ పెద్దలూ ''ఏమేం విశేషాలు'' అంటూ పిన్నలూ వాళ్లని ఆట పట్టిస్తుంటే అరుంధతమ్మ విసుక్కుంది.

''వాళ్లిద్దర్నీ కాస్త స్నానమదీ చేసి రానివ్వండి'' అంది.

స్నానపానాదులు భోజనాలూ అయ్యాక, మనోజ్ వాళ్లకి హనీమూన్ విశేషాలు చెబుతుంటే టైమ్ ఇట్టే గడిచిపోయింది. ఏడున్నరకే కునుకిపాట్లు పడుతున్న వినీలను చూసి ''ఒరేయ్ మనోజ్! మీ సామాన్లన్నీ తాతగారి వాళ్ల రూంలో సర్దించాను. ఇవ్వాళ్టినుంచి మీకే ఆ గది. అమ్మాయిని అక్కడ పడుకోమను'' అంది అరుంధతమ్మ.

''మరి మాకా గదిస్తే తాతయ్యా, నాన్నమ్మా ఎక్కడుంటారు? ఐనా మాకో గది పైన కట్టించమని డబ్బు పంపాగా'' అడిగాడు మనోజ్.

''ఈ వయసులో వాళ్లకో రూం ఎందుకు? నువ్వు పంపిన డబ్బు డిపాజిట్ చేయమన్నాను. ఆ ఇంటరెస్టు డబ్బుతో కొత్తగా వచ్చే ఖర్చుల్నెదుర్కోవచ్చు మీరు'' అందామె తేలిగ్గా.

మనోజ్ కళ్లలో రమణమూర్తి-శ్యామలమ్మలే మెదిలారు. తోడు ఎడబాసిన గువ్వలజంట పడే బాధ వారివల్లనే అతనికి తెలిసింది కాబట్టి. రాబోయే- ఇంట్రస్ట్ డబ్బు వల్ల వచ్చే సుఖాలేమో గానీ తాతయ్యా-నాన్నమ్మలు మున్ముందు ఎదుర్కోబోయే 'ఒంటరితనపు' బాధలు కళ్లముందు నిలిచాయి. తను పదిరోజుల సాహచర్యపు అనంతరం ఒక్క రోజుకి వినీలను వదిలి పడుకోలేకపోయాడు.

''అమ్మా- నేను పంపిన డబ్బుతో పైన రూం కట్టిస్తావనుకుంటే ఈ డిపాజిట్స్ గొడవేంటి? ఆ డబ్బుని వెనక్కి తీసుకొచ్చెయ్యమను చెప్పు నాన్నతో'' అన్నాడు మనోజ్ కాస్త చిరాగ్గా.

''అబ్బ చెప్పింది అర్థం చేసుకోవేంట్రా. ఇంట్రస్ట్ పర్సెంటేజి ఎక్కువిస్తానంటేనే అటు డిపాజిట్ చేయాలనుకున్నాం. ఎలాగూ మీ తాతయ్యని మీ చిన్న బాబాయ్, ఢిల్లీకి తీసుకెళ్లి ఉంచుకుంటానన్నాడు. ఆ తర్వాత అట్నుండి మీ పెదనాన్న దగ్గరకి మెడ్రాస్‌కి వెడతారు. ఎలాగూ మీ నాన్నమ్మ ఒక్కతే ఇక్కడుంటుంది. కాబట్టే, హాల్లోని మంచం మీదో సోఫా మీదో పడుకుంటుందిలెద్దూ'' అందావిడ తేలిగ్గా.


మనోజ్‌కి ఒళ్లు మండింది.

''అమ్మా! నాకు డబుల్ బెడ్ రూం క్వార్టర్స్ అలాట్ చేసినా మిమ్మల్నందరినీ వదిలి వెళ్లడం ఎందుకని వద్దనుకున్నాను. దూరమైనా నేనే కాస్త శ్రమపడి రోజూ వెళ్లి వస్తుంటే సరిపోతుందనుకున్నాను. కానీ ఇప్పుడా నిర్ణయం మార్చుకున్నాను. ఇంకో విషయం, చూడబోతే మీరూ, పెదనాన్నా వాళ్లూ, బాబాయ్ వాళ్లూ - తాతయ్యా నాన్నమ్మలను పంచుకోబోతున్నట్టున్నారు. అది వారిని విడదీయడమని మీకెందుకు తోచడం లేదో నాకు తెలీటం లేదు. సరే.. మీకా శ్రమ అక్కర్లేదు. వాళ్లిద్దరూ ఇక మీదట మాతోబాటుగా మా క్వార్టర్స్‌లో ఉంటారు. మాకో పెద్దదిక్కు కావాలి'' అన్నాడు ఖండితంగా.

మనవడి మాటలు విన్న అతడి తాతా నాన్నమ్మల కళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి. వారి కళ్లలో మెదిలిన ఆనందం మనోజ్ కళ్లని దాటిపోలేదు.

అరుంధతమ్మ చిన్నబుచ్చుకున్నా, కొడుకు అంతరంగానికి ఆనందించింది. గుబగుబలాడే గుండెలతో- విడిపోబోతున్నామనుకునే ఆ వృద్ధ దంపతులు ఆనందంగా దగ్గరికొచ్చి మనోజ్ శిరస్సు నిమిరారు. వారి కళ్లలో మెరిసిన మెరుపులు- మనసు లోలోతుల్లోంచి చొచ్చుకువచ్చిన వారి ఆశీర్వాదాలు- వినీల-మనోజ్‌లకు ఎంతో సంతృప్తిని కలిగించాయి.

☆



## సోహా...ఆహా!

**అప్పటివరకూ ఎలాంటి గుర్తింపునకు నోచుకోనివారు ఒక్కసారిగా అందరి దృష్టిలో పడతారు. తమలోని టాలెంట్ ఏమిటో అప్పుడుగాని వారికి గుర్తుకురాదు. ఇప్పుడు సోహా అలీఖాన్ గురించి అంతా అలాగే అనుకుంటున్నారు. 'రంగ్‌దె బసంతి' చిత్రం తర్వాత నిర్మాతలంతా ఈమె గురించి ఆలోచిస్తున్నారు. అందరిచూపు ఈమె వైపే అన్నట్టుగా ఉంది. 'ఎప్పటినుంచో నాకు రొమాన్స్, సస్పెన్స్ థ్రిల్లర్, హారర్ చిత్రాల్లో నటించాలని ఉంది. అలాంటి అవకాశం వస్తే నేనెంతో హేపీగా ఫీలవుతాను' అంటోంది సోహా. ఆహా ఎంతటి గొప్ప కోరిక నీది సోహా!**